ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.3 । కనిష్ఠం 27.2



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శుక్రవారం 14 జూన్ 2024

'బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి'

ఉట్నూర్, జూన్13: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిపతి లింగగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 52 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పేర్కొన్నారు. బీసీ కులగణనకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. బిల్లు ఆమోదంతోపాటు నిపుణుల కమిటీ ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు.



● బుక్ స్టాల్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

» పాఠశాలల పున:ప్రారంభంతో మొదలైన హడావుడి
» ఫీజుల భారం.. పుస్తకాల ధరలు పైపైకి.. » అడ్డగోలుగా వసూలు చేస్తున్న యాజమాన్యాలు
» పెరిగిపోతున్న ధరలతో తల్లిదండ్రుల్లో ఆందోళన
» అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం



మార్కెట్‌లో జూన్ సందడి!

ఆదిలాబాద్, జూన్13 (ఆంధ్రజ్యోతి): జూన్ మాసం ప్రారంభంకావడంతో మార్కెట్‌లో హడావుడి మొదలైంది. పాఠశాలల పున:ప్రారంభం, అలాగే రైతులు పంటల సాగుకు శ్రీకారం చుట్టడంతో ఎటు చూసినా సందడి వాతావరణమే కన్పిస్తోంది. జూన్ 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. దీంతో మార్కెట్లో అన్నిరకాల వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. జిల్లాలో 1400 పాఠశాలలు ఉండగా ఇందులో ఉన్నత పాఠశాలలు 240, ప్రాథమికోన్నత పాఠశాలలు 175, ప్రాథమిక పాఠశాలలు 985 ఉన్నాయి. బడిబాటతో ప్రభుత్వ ఉపాధ్యాయులు కొత్త అడ్మిషన్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ పాఠశాలల్లో అడ్మిషన్లు పరిమితంగా ఉన్నాయంటూ విస్తృత ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. టెక్నో, ఈ-టెక్నో, మోడల్, డీజీ స్కూల్, ఇంటర్నేషనల్, అనే వివిధరకాల తోక పేర్లతో తల్లిదండ్రులను ఆకర్షించేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. ర్యాంకులు, ఉత్తమ మార్కులను ప్రచారమాధ్యమాలలో ప్రచారంచేస్తూ అడ్మిషన్లు పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. నెలరోజులకు పైగా అడ్మిషన్ల కోసం వివిధరకాల ప్రయత్నాలు చేస్తున్న యజమాన్యాలు పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో వివిధరకాల ఆఫర్లను చేస్తూ అడ్మిషన్లను పెంచుకునేలా ఎత్తుగడలు వేస్తున్నాయి. విద్యాహక్కు చట్టాన్ని అమలుచేస్తున్నా ఆచరణ సాధ్యం కావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. విద్యా శాఖాధికారులు ప్రకటనలతోనే సరిపెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కట్టడి చర్యలు కరువు

ఏటేటా ఫీజుల భారం భారీగా పెరిగిపోతున్నా కట్టడి చర్యలు కరువవుతున్నాయి. వివిధ రకాల కారణాలను సాకుగా చూపుతూ యజమాన్యాలు ఫీజులను మరింత పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కొన్నిప్రైవేట్ పాఠశాలల్లో రాజకీయనేతలు, పలుకుబడి కలిగిన వారి సిఫారసులతో అడ్మిషన్లను ఇచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఏ మేరకు ప్రైవేట్ పాఠశాలలకు డిమాండ్ ఉందో తెలుస్తూనే ఉంది. ఇంగ్లీష్ మీడియం పేరిట కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులను లాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకే రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. అలాగే అడ్మిషన్ ఫీజు, బస్సు ఫీజులు, స్పెషల్ ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. దీనికితోడు పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను కొనుగోలు చేయాలన్న నిబంధనలు పెడుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎన్నో నిబంధనలు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. ఫీజుల నియంత్రణపై అధికారులు దృష్టిసారించక పోవడంతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ప్రతీ పాఠశాలలో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటుచేసి ఫీజుల నియంత్రణను చేపట్టాల్సి ఉండగా ఏ పాఠశాలలో ఇలాంటి పరిస్థితులు కనిపించం లేదు.

అయోమయంలో తల్లిదండ్రులు

ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలు చేస్తున్న వివిధ రకాల ప్రచారంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా కొత్త పేర్లతో పాఠశాలలను ఏర్పాటు చేస్తూ అడ్మిషన్లను పెంచుకునేందుకు ఆరాట పడుతున్నారు. తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయోనన్న ఆలోచనలో పడుతున్నారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, ఫీజుల భారం పెరిగిపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. అప్పులు చేసి పిల్లలను చదివించేందుకు ఆరాట పడుతున్నారు. బస్సు సౌకర్యం, విద్యాప్రమాణాల నాణ్యత పేరిట ప్రైవేట్ యజమాన్యాలు వసూలు చేస్తున్న అధిక ఫీజుల భారం మోయలేక గగ్గోలు పెడుతున్నారు. కొన్నిప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు తాము నియమించుకున్న ప్రత్యేక ప్రతినిధులు (పీఆర్ఓ) ద్వారా అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతేడు సాధించిన ఫలితాలను చూపుతూ విద్యార్థులు, తల్లిదండ్రులను తమ వైపునకు తిప్పుకుంటున్నారు. తల్లిదండ్రుల సెల్ నెంబర్లను సేకరించిన యజమాన్యాలు తరుచు ఫోన్లు, మేసేజ్‌లు చేస్తూ అడ్మిషన్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

గురుకులాలకు భలే డిమాండ్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా గురుకులాల వైపు మొగ్గు చూపడంతో ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు డిమాండ్ ఏర్పడుతోంది. జ్యోతిబాపూలే, కస్తూర్బా, సోషల్ వెల్ఫేర్, మోడల్‌స్కూల్స్, ఏకలవ్య పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో బడిబాట కార్యక్రమానికి ఆదరణ అంతంత మాత్రంగానే కన్పిస్తోంది. ప్రతీయేటా అర్హత పరీక్షలను రాస్తూ విద్యార్థులు గురుకులాల్లో చేరడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోతోంది. ప్రతీయేటా ప్రభుత్వం ఎన్నోకోట్ల రూపాయలను ఖర్చుచేసి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్న విద్యార్థుల సంఖ్య అంతంత మాత్రంగానే కన్పిస్తోం. అధికారులకు ముందు చూపు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ఆశించినస్థాయిలో జరుగడం లేదు. ఏదో నామమాత్రంగానే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వదిలేయడంతో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. జిల్లాలో ఇప్పటికీ 10కి పైగా పాఠశాలల్లో అసలు విద్యార్థులే లేరంటే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎలా ఉందో తెలుస్తూనే ఉంది. డ్రాపౌట్ల సంఖ్య పెరిగిపోవడంతో ప్రభుత్వం ఎన్నిసార్లు హెచ్చరికలు చేసిన క్షేత్ర స్థాయిలో మాత్రం అధికారుల తీరు మారినట్లే కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

● ప్రణీత (జిల్లా విద్యాశాఖాధికారి)



నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేస్తే సహించేది లేదు. నిబంధనలు పాటించని పాఠశాలల వివరాలను తెలుపాలని ఎంఈఓలను ఆదేశించాం. ప్రైవేట్ పాఠశాలలు తప్పని సరిగా ప్రభుత్వ ప్రతీ నిబంధనలు పాటించాలి. ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి పాఠశాలల పర్యవేక్షణ చేయిస్తాం. అధిక ఫీజులను వసూలు చేసే వారిపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలి

బజార్‌హత్నూర్, జూన్ 13: విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలో ఉన్న తొమ్మిది ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని, దుకాణంలో స్టాక్ బోర్డులో ఎప్పటికప్పుడు నిలువ ఉన్న వాటి సమాచారాన్ని నమోదుచేయాలన్నారు. పైస్టిసైడ్, ఫర్టిలైజర్‌కు సంబంధించి ధరలను బోర్డులో పొందుపర్చాలన్నారు. ప్రతీరోజు ఏఈఓలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తారని, ఏమైన సమస్యలు ఉంటే ఏఈఓలకు గాని, వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. రైతుల ప్రతీ కొనుగోలుపై రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఆయనవెంట ఏఈఓలు సంతోష్, సంజీవ్ నాయక్, కృష్ణపాల్, భోజన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

'గో సంరక్షణ అందరి బాధ్యత'

తాంసి, జూన్ 13: గో సంరక్షణ అందరి బాధ్యతని, ప్రతీఒక్కరు ఈ విషయంలో శ్రద్ధచూపాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొండ్ల నారాయణ కోరారు. గురువారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్ గ్రామాల్లో గోసంరక్షణకు సంబంధించిన పోస్టర్లను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకు గోవులు అంతరించిపోతున్నాయని అన్నారు. గోవులను పెంచిపోషించినప్పుడే మనిషి మనుగడకు ఎంతో ఉపయోగం ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొండ్ల నారాయణ, ఉపాధ్యక్షులు శ్రీరామ్ శర్మ, సహ కార్యదర్శి రాజుల్వార్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

● ఎంపీడీవో రవీంద్రనాథ్

జైనథ్, జూన్13: పారిశుధ్య లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీంద్రనాథ్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆయన గ్రామకార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది పలు అంశాలపై సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 42గ్రామ పంచాయ తీ పరిధిలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మురికి కాల్వల్లో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు మంచినీటి ట్యాంకులు బావులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ పథకం మంచినీటి నల్ల కనెక్షన్ ఇచ్చి వాటికి తాగునీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జైనథ్ ఎంపీఈఓ సోమదిలీప్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ చంద్రశేఖర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్13: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతతోపాటు జాగ్రత్తలు పాటించేలా గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో కలెక్టర్ రాజర్షిషా సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని, వర్షాలు, వరదలతో నష్టం కలుగకుండా ముందస్తుగా శిథిలమైన, కూలిపోయే స్థితిలోఉన్న వాటిని గుర్తించి వెంటనే కూల్చివేయాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి వరదల తాటికి నివాసగృహాలు మునిగిపోకుండా ముందస్తుచర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రపరచాలని, పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్త కుప్పలను మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సీజన్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని అన్నిఅంశాలపై చర్చించుకోవాలని, ట్రైబల్‌స్కూల్స్, కేజీబీవీలను ప్రతీరోజు సందర్శించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం, శుక్రవారాలలో డ్రై డేను నిర్వహించాలన్నారు. ఆర్‌బీఎస్‌కే 8టీంలు జిల్లాలో ఉన్నాయని, ఈటీమ్‌లు అప్రమత్తంగా ఉండాలని, యాక్షన్ ప్లాన్ తయారుచేసి రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ఆశావర్కర్లకు వెయిటింగ్‌రూమ్ ఏర్పాటుచేయాలని సూచించారు. హైరిస్క్ ఏరియాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి నరేందర్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు

నేరడిగొండ, జూన్ 13: ఆదిలాబాద్ ఎంపీగా ఎన్నికై మొదటిసారి గోడం నగేష్‌ను వారి నివాసంలో నేరడిగొండ మండల అధ్యక్షులు సాబ్లె సంతోష్‌సింగ్, మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ తన గెలుపు కోసం కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని అన్నారు. మండలం నుంచి బీజేపీకి మెజార్టీ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సాబ్లె సంతోష్‌సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో తెగిపడిన కరెంట్ తీగలు

సిరికొండలో గాలివాన బీభత్సం

సిరికొండ, జూన్ 13: సిరికొండలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి సిరికొండ గ్రామ సమీపంలో ఇచ్చోడకు వెళ్లే రోడ్డుపై విద్యుత్ స్తంభం పడిపోగా, కొండాపూర్ గ్రామంలో విద్యుత్ నియంత్రికలు తెగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. వారం రోజులుగా వర్షం జాడలేక చేలల్లో విత్తనాలు విత్తుకుని ఎదురుచూస్తున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో రైతుల్లో సంతోషం కన్పించింది.

బీసీ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 13: ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజలింగు తెలిపారు. ఆదిలాబాద్‌లోని శాఖ కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిషేధిత పొగాకును అమ్మితే కఠిన చర్యలు

● రూ.3,15,150 విలువ గల నిషేధిత పొగాకు స్వాధీనం ● మావల పీఎస్‌లో ముగ్గురిపై కేసు : డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

మావల, జూన్13: నిషేధిత పొగాకును విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. నిషేధిత పొగాకును విక్రయిస్తున్న ఓ నిందితుడిని పట్టుకుని అతని వద్ద ఉన్న రూ.3,15,150 విలువ గల పొగాకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు డబ్బు మీద అత్యాశకు పోయి ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులను అమ్మి డబ్బులు సంపాదించాలని పొగాకును విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన షేక్ అఫ్సర్, భుక్తపూర్ కాలనీకి చెందిన అక్రమ్, మన్సూర్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన ఉత్పత్తులు ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా జిల్లా ఉన్నతాధికారులకు డయల్ 100 ద్వారా సమాచారాన్ని అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు. డబ్బుల కోసం అత్యాశకు వెళ్లి నేరాలకు పాల్పడుతూ కేసుల్లో ఇరికి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో రూరల్ సీఐ ఫణీందర్, ఎస్ఐ విష్ణువర్ధన్, మావల పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ

'రైతులను అధికారులు ఇబ్బంది పెట్టొద్దు'

ఆదిలాబాద్ రూరల్, జూన్13: పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసులను అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెట్టొదని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అటవీ ప్రాంతాన్ని సందర్శించి అటవీ అధికారులతో మాట్లాడారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసుల భూముల్లో అటవీ అధికారులకు మొక్కలు నాటడానికి జేసీబీతో తవ్వడాన్ని ఆపాలన్నారు. ఆదివాసులు 15ఏళ్లుగా పోడుభూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారని, ఇప్పుడు మొక్కలునాటితే వారి బతుకులు ఏం కావాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. తవ్వకాలను ఆపకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని పైఅధికారులకు ఫోన్‌లో తెలపడంతో ఎట్టకేలకు అధికారులు జేసీబీని తిరిగి పంపించారు. ఎన్నోఏళ్లుగా పోడుభూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మాకి ఆనంద్ రావ్, నాయకులు కోరెడ్డి కిషన్, సుధాకర్ గౌడ్, మల్లన్న, సోమన్న, గంగారం, బ్యాపురావ్, జాకు, కిషన్ పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 13: తమకు కనీస వేతనం చెల్లించాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ఆశాకార్యకర్తలపై పని భారం తగ్గించాలన్నారు. ఆశాకార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశాల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా అధ్యక్షురాలు ఎన్.శోభ, ఆశా జిల్లా కార్యదర్శి సుజాత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సభ్యులు కాంత, రుక్మణి, ఆశ, పుష్ప, లక్ష్మి, కె.పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్అర్బన్, జూన్13: పట్టణంలోని ఖుర్షిద్‌నగర్ ప్రాంతంలోని మమత జిన్నింగ్ మిల్ వద్ద గురువారం గాయాలతో ఉన్న మహిళా మృత దేహం లభించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. మహిళకు సుమారు దాదాపు 30ఏళ్ల వయస్సు ఉంటుందని, ఎరుపు రంగుతో ఉండి గులాబీ రంగుచీర, జాకెట్ ధరించి ఉందని తెలిపారు. మహిళను గాయపర్చి, హత్య చేసి పడేసినట్లు ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ముఖం, ఒంటిపై గాయాలు ఉండడంతో ఆదిలాబాద్ 2వ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సంబంధికులు ఎవరైనా సమాచారం తెలియజేయాలనుకుంటే డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి 8712659914, ఆదిలాబాద్ 2వ పట్టణ సీఐ అశోక్ 8712659920కు సంప్రదించాలని కోరారు. మృతదేహం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఉన్నట్లు తెలిపారు.

పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

సిర్పూర్(టి), జూన్ 13: మహారాష్ట్రలోని గోండ్ పిప్పిరి తాలూకా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని గురువారం సిర్పూర్ (టి) ఎస్సై దీకొండ రమేష్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి హైద రాబాద్‌కు అక్రమంగా పశువులను రావాణా చేస్తు న్నారన్న పక్కాసమాచారం మేరకు సిర్పూర్ (టి) గ్రామసమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్నామ న్నారు. ఈ తనిఖీల్లో ఓ లారీని సోదాలు చేయగా 38 పశువులు పట్టుబడినట్లు తెలిపారు. అక్రమార్కులు సిమెంట్ లారీగా చెప్పే ప్రయత్నం చేశారని కానీ లారీని తనిఖీచేయగా పశువుల ఉన్నట్లు పేర్కొ న్నారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశా లకు తరలించి షేక్ జమీల్, షేక్ అర్బాజ్, మహమ్మద్ షేక్, జైనుద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూన్ 13: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఉప ప్రధానకార్యదర్శి నాగరాజు గోపాల్ అన్నారు. ఎస్ఆర్పీ1 గనిపై గురువారం యూనియన్ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతినెల అధికారికంగా నిర్వహించవలసిన రక్షణకమిటీలను పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల కార్మికుల సమస్యలు పేరుకుపోయాయని ఆరోపించారు. కొందరు సూపర్‌వైజర్లు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గనుల్లో పనిముట్ల కొరత, వెంటిలేషన్ లోపం ఉందని, పని ఒత్తిడితో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోడు రైతులతో
అధికారుల చర్చలు విఫలం

సిర్పూర్(టి), జూన్ 13: మండలంలోని ఇటిక్యాలపహాడ్ గ్రామంలోని రిజర్వు ఫారెస్టులో ఉన్న పోడుభూముల రైతులతో రెవెన్యూ, ఫారెస్టు అధికారులు గురువారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. రైతులకు అయిదు ఎకరాలు ఇవ్వాలని రైతులకు మద్దతుగా బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో సురేష్, ఎఫ్ఆర్వోలు అప్పలకొండ, పూర్ణచందర్ రావు మాట్లాడుతూ న్యాయబద్ధంగా ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున ఉన్నతాధికా రులతో మాట్లాడి భూమిని కేటాయిస్తామ న్నారు. దానికి గ్రామస్థులు ఒప్పుకోలేదు. తాము మళ్లీచేనులలో సాగు చేసు కుంటామని రైతులు పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి రెవెన్యూ, అటవీ అధికారులు అయిదు ఎకరాల చొప్పున పట్టాచేసి ఇవ్వాలని డిమాండ్ చేశా రు. దీంతో అధికారులు జిల్లా అధికారులకు నివేది కలు సమర్పిస్తామని సూచించారు. ఇటిక్యాల పహాడ్ గ్రామస్థులకు బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, అశోక్, శంకర్ మద్ద తుగా నిలిచారు. 50ఏళ్లుగా భూముల ను సాగు చేసుకుంటున్నారని వారికిరెండు ఎక రాలచొప్పున ఇస్తామనడం ఎంతవరకు సమం జసమని వారు అధికారులను ప్రశ్నించారు. ఒక్కో కుటుంబానికి అయిదుఎకరాల పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో పాల్గొన్న పోడు రైతులు



నల్లా కనెక్షన్ల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తిచేయాలి

ఇంద్రవెల్లి, జూన్ 13: మిషన్ భగీరథ ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని పిట్ట బొంగురం గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆయన పర్యవేక్షించి యాప్‌లోనూ వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి నల్లా కనెక్షన్ కలిగిన నివాస గృహాలు ఇంకా ఇవ్వాల్సిన ఇళ్ల వివరాల నూతనంగా నిర్మించిన ఇళ్లకు ఇవ్వాల్సిన ఇళ్ల వివరాల, నూతనంగా నిర్మించిన ఇళ్ళకు ఇవ్వాల్సిన నల్లా కనెక్షన్‌ల వివరాలన్నీ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి: ఎంపీ

తలమడుగు, జూన్13: దేవాపూర్ గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎంపీ నగేష్ అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీగా గెలుపొందిన ఎంపీ నగేష్‌ను దేవాపూర్ గ్రామ బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దాతజీ కిరణ్, శానం శ్రీనివాస్, ఆడేపు శ్రీను, పూలవేణి గణేష్, చింతల రాజు, రేగుల మోహన్, పోరండ్ల రాములు, నగేష్, అశోక్, రాహుల్, రవిలు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు

గుడిహత్నూర్: ఎంపీ గోడం నగేష్‌ను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు జాదవ్ విజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి తన గెలుపునకు కృషి చేశారని ఈ సందర్భంగా వారిని ఎంపీ నగేష్ అభినందించారు. అలాగే ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిశారు.

బోథ్: ఎంపీగా గెలుపొందిన గోడం నగేష్‌ను గురువారం బోథ్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నూతనంగా గెలుపొందిన ఆయనను ఆదిలాబాద్‌లోని స్వగృహంలో కలిసి సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో వెంకటేష్ వార్డు సభ్యులు గంగయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా మండలంలోని కౌటా(బి) గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గడ్డం రమణ తదితరులు సన్మానించారు.

రైతులను నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు

● విత్తనాలు నాటి 15 రోజులైనా మొలక రాలేదని రైతుల ఆందోళన



రైతులు కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్లు

తలమడుగు, జూన్13: ప్రతీయేటా రైతులకు విత్తన కష్టాలు తప్పడం లేదు. ఒక వైపు విత్తనాల కొరత... మరోవైపు నకిలీ విత్తనాల బెడదతో రైతులకు అష్టకష్టాలు పడుతున్నారు. తలమడుగు మండలం (అర్లి కే) గ్రామానికి చెందిన రైతులైన ఉశన్న, భీమ్‌రెడ్డి, శ్రీధర్, వెంకన్న, రాజేష్, సు రేందర్‌రెడ్డి, దత్తు, శ్రీకాంత్‌రెడ్డి కర్షక్ సీడ్స్ వెరైటీ సూపర్ వైట్, సూపర్ గోల్డ్, కంపెనీకు చెందిన విత్తనాలను ఆదిలాబాద్‌లోని విత్తనాల దుకాణాల్లో కొనుగోలు చేసినట్లు చెప్తున్నారు. విత్తనాలు కొనుగోలుచేసి పొలాల్లో నాటి 15 రోజులు గడుస్తున్నా మొలకెత్తడం లేదని ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు, డీలర్లకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని, రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించిన సంబంధిత డీలర్లపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అదే విధంగా ఆ కంపెనీకి చెందిన విత్తనాలు నాటడంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు దీనిపై వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

15 నుంచి స్పాట్ అడ్మిషన్లు

ఆదిలాబాద్ రూరల్, జూన్13: జిల్లాకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ (పురుషుల) డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 25 వరకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అన్ని ఒజినల్ సర్టిఫికెట్స్, ఫొటో, ఆధార్ కార్డుతో పాటు రెండు సెట్స్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ, జూన్ 13: మండలం శంకరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజు 2రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాంజాదవ్ ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. రాజుకు తల్లి, భార్య, పాప ఉన్నారని, కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉన్నందుకు గ్రామస్థులు బలరాం జాదవ్‌ని ధన్యవాదాలు తెలిపారు.

తెరచుకోని పాఠశాల.. అయోమయంలో తల్లిదండ్రులు!



ఫకీర్‌నాయక్ తండా గ్రామంలో గల గిరిజన ప్రాథమిక పాఠశాల ఇదే..

సిరికొండ, జూన్ 13: పాఠశాలలు పునః ప్రారంభమై రెండ్రోజులైనా సిరికొండ మండలం ఫకీర్‌నాయక్ తండా గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల మాత్రం తెరుచుకోలేదు. దీంతో తమ పిల్లలను ఏ బడి పంపాలో దిక్కుతోచక విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. వారం రోజుల క్రితం ప్రారంభమైన బడిబాట కార్యక్రమంలో సైతం ఉపాధ్యాయుడు పాల్గొనకపోవడంతో గ్రామంలోని దాదాపు 20 మంది పిల్లలు చదువులకు దూరమయ్యే ఆస్కారం ఉందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాల ప్రారంభమై రెండురోజులైనా ఇంకా ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంబంధిత అధికారిని సంప్రదించినప్పటికీ స్పందించడంలేదని తల్లిదండ్రులు వాపోయారు. ఐటీడీఏ అధికారులు స్పందించి పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడిని పంపించాలని వారు కోరుతున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పాల్గొన్న కలెక్టర్

ఆరు ఇండికేటర్లను కచ్చితంగా పూర్తిచేయాలి

● వీసీలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 13: మొదటి త్రైమాసికంలో ఏఎన్‌సీ కోసం నమోదు చేసుకున్న ఆరు ఇండికేటర్లను కచ్చితంగా పూర్తిచేయాలని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం ఆదేశించారు. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం అధ్యక్షతన అడిషనల్ సెక్రటరీ గీతాంజలి గుప్తా ఆకాంక్ష జిల్లాలు, బ్లాకుల కార్యక్రమంపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజార్షిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతిఆయోగ్ టీంతో జరిగిన సమావేశంలో సీఈవో, నీతిఆయోగ్ విషయాలను వివరించారు. రాబోయే 3నెలల సమయంలో 6ఇండికేటర్స్‌ను నార్నూర్ మండలంలో కచ్చితంగా వందశాతం పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యంలో మొదటి త్రైమాసికంలో ఏఎన్‌సీ కోసం నమోదు చేసుకున్న గర్భిణీ స్త్రీలు, హైపర్ టెన్షన్ కోసం పరీక్షించబడిన వ్యక్తులు, మధుమేహం కోసం పరీక్షించబడిన వ్యక్తుల శాతం, పోషకాహారం హెచ్‌డీఎస్ ప్రోగ్రామ్ కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్ తీసుకునే గర్భిణీ స్త్రీలు, వ్యవసాయం.. మట్టి నమునా సేకరణ లక్ష్యానికి వ్యతిరేకంగా ఉత్పత్తి చేయబడిన సాయిల్ హెల్త్‌కార్డుల, బ్లాక్‌లోని మొత్తం ఎస్‌హెచ్‌సీలకు వ్యతిరేకంగా రివ్వాలింగ్ ఫండ్‌ను స్వీకరించిన ఎస్‌హెచ్‌జీల శాతాన్ని కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. కాగా ఆరు ఇండికేటర్స్ సాధించడానికి కావాల్సిన, సంబంధిత డిపార్ట్‌మెంట్ 3 నెలల యాక్షన్ ప్లాన్ (1జూన్ 2024 నుంచి 30సెప్టెంబర్ వరకు)ను ఈనెల చివరిలోపు సిద్ధం చేసి పంపించాలని తెలిపారు. పంపిన యాక్షన్ ప్లాన్‌ను కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రివ్యూ చేస్తారని చెప్పారు. ఏబీపీ ఇండికేటర్స్ లేటెస్ట్ ప్రోగెస్, బీడీఎస్ రివ్యూ డాక్యుమెంట్‌ను ఈనెల 20లోపు నీతి ఆయోగ్‌కి పంపించాలని సూచించారు. వివిధ జిల్లాలో ఆచరిస్తున్న ఉత్తమ పద్ధతులను తెలుసుకోవడానికి నీతి ఫర్ స్టేట్స్ అనే వాట్సాప్ చానల్‌లో అన్ని మండల ఆఫీసర్స్ జాయిన్ కావాలన్నారు. "వోకల్ ఫర్ లోకల్" అనే ప్రోగ్రాంలో భాగంగా అభివృద్ధి, స్కేల్ ఆఫ్ ఆఫ్‌చేయడానికి మండలంలో అందుబాటులో ఉన్న అక్కడి లోకల్ ఉత్పత్తులను గుర్తించాలని సూచించారు.

మత్స్యకార సహకార నూతన మహిళా సంఘం ఎన్నిక

ఆదిలాబాద్ రూరల్, జూన్ 13: ఆదిలాబాద్ మత్స్యకార పారిశ్రామిక సహకార మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బొంపల్లి కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శి ఎల్లుల కవిత, ఉపాధ్యక్షురాలు చిట్ల పోసానితోపాటు 6మందిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. నూతన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొంపల్లి భూమన్న, ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, తదితరులున్నారు.

సాంఘిక బహిష్కరణ చేసిన గ్రామస్థులపై చర్యలు తీసుకోవాలని కుభీర్‌లో ధర్నా



రాస్తారోకో చేస్తున్న పార్డి(కే) మాల సామాజిక వర్గ నాయకులు



ఆందోళనకారులను సముదాయిస్తున్న అధికారులు

కుభీర్, జూన్ 13 : మండలంలోని పార్డి(కే) గ్రామంలో మాల సామాజిక వర్గానికి చెందిన 25 మంది కుటుంబాలను అదే గ్రామానికి చెందిన అగ్ర వర్ణాల వారు తమకు సాంఘిక బహిష్కరణ చేశారని గురువారం మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా కుభీర్-భైంసా రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గ్రామస్థులపై చట్ట పరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల గ్రామంలో డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం చుట్టు ప్రహరీగోడ నిర్మాణంలో గ్రామస్థులతో వాగ్వాదం జరిగిన నుంచి సహాయ నిరాకరణ చేశారని అన్నారు. వ్యవసాయ పనులకు అవసరమైన ట్రాక్టర్లు పంపడం లేదని తమ ఆటోలో ఎవరూ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పలకరించడం లేదని వాపోయారు. అంటరాని వారిగా చూస్తు మానసికంగా హింసిస్తున్నారని అన్నారు. గ్రామస్థులపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికయినా గ్రామస్థులందరిపై ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గంటపాటు రాస్తారోకో, ధర్నా కొనసాగింది. సమాచారం అందుకున్న ఎస్సై రవీందర్ పోలీసులు, తహసీల్దార్ ఘటన స్థలానికి చేరుకొని సముదాయించారు. చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించు కున్నారు. అనంతరం తహసీల్దార్ సోముకు పలు డిమాండ్స్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాస్తారోకోలో గ్రామస్థులు శాహనే సిద్ధు, రంజిత్, విశాల్, రమేష్, రతన్, గంగాధర్, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని
స్కూల్ బస్సులపై ఆర్‌టీవో అధికారుల కొరడా

భైంసా, జూన్ 13 : ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోకుండా విద్యార్థులను చేరవేస్తున్న స్కూల్ బస్సులపై అర్‌టీవో అధికారులు కొరడా ఝులిపించారు. గురువారం భైంసా పట్టణ ప్రవేశ మార్గాల్లో తనిఖీలు చేపట్టిన ఆర్‌టీవో అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని ఒక పాఠశాల బస్సును పట్టుకొని సీజ్ చేశారు. జిల్లా పరిధిలో విద్యా సంస్థలకు సంబంధించి మొత్తం 244 బస్సులు ఉండగా గురువారం వరకు 117 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు జరిగాయి. ఇంకా 127 పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వాహించాల్సి ఉంది. దీంతో ఫిట్‌నెస్ పరీక్షలు జరుగని బస్సులను గుర్తించి చర్యలు చేపట్టేందుకు ఆర్‌టీవో అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే తనిఖీలను ముమ్మరం చేశారు. విద్యా సంస్థల యాజమాన్యాలు జాప్యపు విధానాలను అవలంబించకుండా తమ తమ పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోవాని అర్‌టీవో అధికారులు సూచించారు. లేని పక్షంలో సంబంధిత బస్సులను సీజ్ చేస్తామని వెల్లడించారు.

ఏకముఖి హనుమాన్ ఆలయంలో చోరీ

భైంసా, జూన్ 13 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని మిషన్ భగీరథ పంప్ హౌజ్ వద్ద ఉన్న ఏకముఖి హనుమాన్ ఆలయంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. గురువారం ఉదయం ఆలయ సందర్శనకు వెళ్లిన భక్తులు, స్థానికులు హుండీ ధ్వంసమైన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని దుండగులు గుడి తాళాలు పగలగొట్టి హుండీని ధ్వంసం చేసి భక్తులు సమర్పించిన నగదును అపహరించుకుపోయినట్లుగా ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. గత మూడు రోజులుగా పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చోరి ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో రాత్రి పోలీసులు గస్తీ ముమ్మరం చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు'

నిర్మల్ కల్చరల్, జూన్ 13 : గత పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి గతంలో ఎన్నడూ లేని విధంగా అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి అన్నారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లు ఏమాత్రం అవగాహన లేకుండా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. తమ హయాంలో కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకుందని సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున ఉద్యోగ నియామక పత్రాలు అందించి కొత్తగా 11 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. పాఠశాలల్లో కనీస వసతులు కలిపించలేకపోయారని ఆరోపించారు. కాళేశ్వరం, గొర్రెల పంపిణీలో భారీగా అవినీతి జరిగిందన్నారు.

ఎల్వత్‌లో అక్రమ మైనింగ్‌ను ఆపాలని గ్రామస్థుల వినతి

తానూర్, జూన్ 13 : మండలంలోని ఎల్వత్ గ్రామంలో రాత్రి అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్‌ను ఆపాలని గురువారం తహసీల్దార్ లింగమూర్తికి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 177లోని 100 ఎకరాల భూమిని పేద ప్రజలకు అసైండ్ భూమిగా కేటాయించారు. అయితే ఈ భూమి మహారాష్ట్ర సరిహద్దులో ఉండడంతో రాత్రి 12గంటల తరువాత మహారాష్ట్ర ధర్మాబాద్‌కు సంబంధించిన మైనింగ్ మాఫియ వాళ్లు అక్రమంగా మొరాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. దీంతో తెలంగాణ ఖనిజసంపద నశించపోతుందని, పెద్దపెద్ద జేసీబీ మిషన్‌లతో మొరం తవ్వకాలు జరపడంతో 200-300 మీటర్ల వరకు తవ్వకాలు జరిపగా పుడ్చకుండా ఉండడంతో ఏర్పడిన గుంతల్లో మూగజీవాలు పడి ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు.

'విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి'



విత్తనశుద్ధి చేసుకునే విధానం గురించి వివరిస్తున్న దృశ్యం

ముథోల్, జూన్ 13 : రైతులు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని బ్రహ్మాన్‌గాం వ్యవసాయ విస్తరణ అధికారి ఋషికేష్ అన్నారు. గురువారం మండలంలోని ఆష్ట, బ్రహ్మాన్‌గాంలో సోయా వేసే రైతులకు విత్తన శుద్ధి చేసుకునే విధానం, దీని వలన లాభాల గురించి వివరించారు. విత్తనం ద్వారా గానీ నేల ద్వారా గానీ వచ్చే తెగుళ్ల, పురుగుల నివారణకు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. రైతులు తీసుకొచ్చిన సోయా బ్యాగ్‌లో విత్తన శుద్ధి చేయడానికి ప్యాకెట్ వచ్చి ఉంటే అది పడేయకుండా రెండు గంటల ముందు విత్తనానికి కలిపి విత్తుకోవాలన్నారు. లేదా సోయా విత్తనం వేసే రెండు గంటల ముందు కార్బాగ్జిన్, థైరం అనే మూడు గ్రాముల పొడి మందుతో ఒక కిలో విత్తనంకు కలిపి రెండు గంటల తరువాత విత్తుకోవాలి. లేదా ట్రైకోడర్మా విరిడే 8 గర్ముల మందును ఒక కిలో విత్తనంకు కలిపి విత్తుకోవాలని పేర్కొన్నారు.

ఏఐఎస్‌బీ 74వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి



వార్షికోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముథోల్, జూన్ 13 : ఈ నెల 25న జరిగే అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 74వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఏఐఎస్‌బీ ముథోల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వాగ్మారే అమూల్ కోరారు. గురువారం సంబంధిత వార్షికోత్సవాల పోస్టర్లను ముథోల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏఐఎస్‌బీ 1951లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఏర్పడి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకై కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సోషలిజం సాధనకై నేతాజీ కలలు కన్న భారత దేశ పునర్నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ విద్యాసంస్థల యూనివర్సిటీల పరిరక్షణకై విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా గత 73వ సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని ఆయన కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 74వ వార్షికోత్సవాలను ఏఐఎస్‌బీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముథోల్ నియోజకవర్గం అమూల్, చింటూ, దిలీప్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.3 । కనిష్ఠం 26.8

నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 14 జూన్ 2024


చెరువులు, కందకాలు, నాలాలు
కబ్జాకు గురికావడంతో ఇళ్లల్లోకి వర్షపు నీరు (ఫైల్)



ఆగని ఆక్రమణలు





హద్దును గుర్తిస్తూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు పెడుతున్న అధికారులు (ఫైల్)

జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ చెరువులో మొరంతో ఫిల్లింగ్ చేసిన దృశ్యం



నిర్మల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని చారిత్రక గొలుసుకట్టు చెరువు భూముల విస్తీర్ణాన్ని గుర్తించినప్పటికీ ఆక్రమణలకు మాత్రం అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఇక్కడి గొలుసుకట్టు చెరువు భూముల విస్తీర్ణంతో పాటు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను కూడా రెవెన్యూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు గుర్తించారు. గత కొన్నేళ్ల నుంచి గొలుసుకట్టు చెరువు భూముల ఆక్రమణ పెద్ద ఎత్తున జరుగుతున్న ఆరోపణలు వస్తుండటం, అలాగే ఆక్రమణలపై కొంత మంది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించడంతో జిల్లా యంత్రాంగం ఈ భూముల నిర్ధారణ రక్షణకు చర్యలు చేపట్టింది. దీనికోసం గాను చెరువు భూములపై డీజీపీఎస్ విధానంతో సర్వే చేపట్టారు .మొత్తం పదకొండు గొలుసు కట్టు చెరువుల సర్వేచేపట్టి విస్తీర్ణాన్ని నిర్ధారించారు. బంగల్‌పేట్ చెరువు 210.32 ఎకరాలు, ఖజానా చెరువు 98.22 ఎకరాలు, కొత్త చెరువు 33.11 ఎకరాలు, రాంసాగర్ 37.23 ఎకరాలు, జాహూర్ కుర్రన్న పేట చెరువు 76.18 ఎకరాలు, సీతా సాగర్ గొల్లపేట చెరువు 48.11 ఎకరాలు, ఇబ్రహీం చెరువు 76.18 ఎకరాలు, కంచరోని చెరువు 74.19 ఎకరాలు, ధర్మసాగర్ చెరువు 65.10 ఎకరాలు, మోతితలాబ్ 132.06 ఎకరాలు, చిన్నచెరువు మంజులాపూర్ 81.34 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు తేల్చారు. అలాగే చెరువు శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్‌ను కూడా గుర్తించిన అధికారులు ఎఫ్‌టీఎల్ నుంచి తొంభై అడుగుల దూరం వరకు బఫర్‌జోన్‌గా నిర్ధారించారు. ఈ బఫర్ జోన్ వరకు ఎలాంటి నిర్మాణాలు చేయకూడదన్న నిబంధన ఉంది. బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాలు గానీ రియల్ వెంచర్లకు గానీ ఎన్‌వోసీలను సంబంధిత ఇరిగేషన్‌శాఖ జారీ చేయకూడదు. అలాగే మున్సిపాలిటీ అధికారులు నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయకూడదని నిబంధనలు విధించారు. చెరువు భూముల నిర్ధారణతో ఇక ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావించారు. అయితే హైకోర్టు తీర్పు నేపథ్యంలో సంబంధిత అధికారులు చెరువు భూములకు హద్దులు నిర్ధారించడమే కాకుండా ఆ హద్దులలో ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. కొద్దిరోజులపాటు చెరువు భూముల ఆక్రమణల వ్యవహారం దీని కారణంగా స్తబ్దంగా మారింది. అయితే ప్రస్తుతం మళ్లీ కొంతమంది ఈ హద్దులను చెరిపేస్తూ ఆక్రమణల పర్వానికి తెరలేపుతున్నారు. అప్పట్లో హద్దులు నిర్ణయించిన అధికారులు బదిలీ కావడంతో కొత్త అధికారులకు ఈ చెరువుల హద్దులపై పెద్దగా అవగాహన లేకపోవడం కబ్జాదారులకు కలిసొస్తుందంటున్నారు.

హద్దులను చెరిపేస్తున్నారు

కాగా నిర్మల్ చుట్టూరా ఉన్న గొలుసుకట్టు చెరువుల ఆక్రమణలపై గతంలో న్యాయవాది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. హైకోర్టు ఇక్కడి చెరువుల ఆక్రమణలపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా కలెక్టర్‌కు సైతం నోటీసులు జారీ చేసింది. అలాగే జిల్లా కోర్టుకు సంబంధించిన న్యాయమూర్తిని చెరువుల ఆక్రమణలపై పరిశీలించాలంటూ సూచించింది. అయితే రాష్ట్ర హైకోర్టు కలెక్టర్‌కు హెచ్చరికలు జారీ చేయడంతో యంత్రాంగం ఒక్కసారి కదిలింది. హుటాహుటిన జీపీఎస్ విధానంతో చెరువు భూముల సర్వేలు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన ఈ హద్దుల ఆధారంగా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడం, ట్రెంచ్‌లను తవ్వడం లాంటి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కబ్జాదారుల కంచరోని చెరువు, ధర్మసాగర్, సీతాసాగర్, పల్లె చెరువు భూములపై మళ్లీ కన్నేశారు. క్రమంగా చెరువు భూములకు ఆనుకొని ఉన్న పట్టా భూముల సర్వేనంబర్ పేరుతో ఈ భూములను కూడా కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల చెరువులో వెంచర్లు కూడా మొదలుపెట్టారు. చెరువు భూములలో ఆక్రమణ బహిరంగంగా జరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

- గొలుసుకట్టు చెరువుల భూముల లెక్కలకు రెక్కలు
- అధికారులు మారారు.. అంతా మరిచిపోయారు
- హద్దులను చెరిపేస్తున్న చేస్తున్న రియల్టర్లు
- శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు గుర్తించినా ఆగని కబ్జాలు
- నిబంధనలు తుంగలో తొక్కి.. అనుమతులు
- శిఖం, ఎఫ్‌టీఎల్‌లో భారీగా నిర్మాణాలు

దీనిని అవకాశంగా తీసుకుంటున్న కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారంటున్నారు.

శిఖం, ఎఫ్‌టీఎల్‌లో భారీగా నిర్మాణాలు..

జిల్లా కేంద్రంలోని గొలుసు కట్టు చెరువుల పరిధిలో గల శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతోంది. నివాసగృహాలతో పాటు భారీఎత్తున వాణిజ్య సముదాయాల నిర్మాణాలు అడ్డగోలుగా కొనసాగుతు న్నాయి. నిబంధనల ప్రకారం శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లో ఎలాంటి అనుమతులు జారీ చేయరాదు. అయితే అధికారుల నిర్లక్ష్యం, భారీ ఎత్తున మామూళ్ల వ్యవహారం అనుమతుల నిబంధనలను తుంగలో తొక్కుతోందంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి తప్పుడు ఎన్‌ఓసీలు సృష్టిస్తూ రికార్డులను సైతం తారుమారు చేస్తూ అడ్డగోలు నిర్మాణాలను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే సంబంధిత మున్సిపాలిటీకి చెందిన అధికారులు ఈ అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ అక్రమ నిర్మాణాల కారణంగా ప్రతియేటా చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరుకోవడంతో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. ఇకనైనా ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నిర్మల్‌లోని ప్రధానరోడ్లపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)


నూతన పోలీసు చట్టాలపై అవగాహన అవసరం

● ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జూన్ 13 : జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు కాబోయే నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన అవసరమని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. గురువారం కొత్త చట్టాలపై శిక్షణ, అవగాహన తరగతులను ఆన్‌లైన్ లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలోని 59 పోలీసుస్టేషన్ల పరిధిలోని సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సెక్షన్లపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే కొత్త చట్టాల అమలు సాధ్యమవుతుందన్నారు. ఫిర్యాదులు స్వీకరించడం, సెక్షన్ల నమోదు, స్టేషన్‌బెయిల్‌కు ఎవరు అర్హులు తదితర వాటిపై పూర్తి అవగాహన ఉంటుందన్నారు. నిందితులకు శిక్ష ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలో తెలియజేస్తారన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, సంహిత, భారతీయ సాక్ష్యా అధ్యయనం చట్టాలు అమలు కానున్నాయని తెలిపారు. ఈ చట్టాలపై అవగాహన కలిగి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని కోరారు. కొత్త చట్టాలపై రిటైర్డ్ పీపీ శ్రీరాములు శిక్షణ అవగాహన కల్పించారు. సిబ్బంది సందేహాలు నివృత్తి చేశారు.

ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకవస్తా

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్


వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, జూన్ 13 : రోగులకు మెరుగైన రీతిలో చికిత్సలు అందించేందుకు భైంసా ఏరియా ఆసుపత్రిలో ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకవస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ హామీ ఇచ్చారు. గురువారం ఏరియా ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రిలో సి.టి స్కాన్ ఏర్పాటుకు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకవచ్చేందుకు ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. అన్ని రకాల వసతులు కల్పించేందుకు, సౌకర్యాలు మెరుగుపరచేందుకు బాధ్యతాయుతంగా కృషి చేస్తానన్నారు. ఏరియా ఆసుపత్రిలో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందింపచేయాలన్నదే తన లక్ష్యమని వివరించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అంకిత భావంతో విధులను నిర్వహించాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించబోనని వెల్లడించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశమున్నందుకు మందుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్యాధికారులతో ఆసుపత్రిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడుతానని తెలిపారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కాశీనాథ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వాహన ప్రమాదం కేసులో అవకతవకలకు పాల్పడిన ఎస్సై సస్పెండ్

● ఉత్తర్వులు జారీ చేసిన మల్టీ జోన్- 1 ఐజీపీ రంగనాథ్

సారంగాపూర్, జూన్ 13 : వాహనబీమా సొమ్ము క్లయిమ్ కోసం కేసు దర్యాప్తులో అవకతవకలకు పాల్పడి యజమానికి లబ్ధి చేకూర్చేందుకు యత్నించిన అప్పటి నిర్మల్‌రూరల్ ఎస్సై కే.చంద్రమోహన్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీపీ ఏవీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనదారుడు కారును ఢీకొట్టిన సంఘటనలో సదరు ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడటం జరిగింది. ఈ సంఘటన గత ఫిబ్రవరి 2వ తేదీన జరిగింది. కానీ ద్విచక్ర వాహనం ఢీకొట్టిన కారు సంబంధించిన వాహనబీమా గడువు ముగియడంతో కారు యజమాని ఫిబ్రవరి 3వ తేదీన కారు బీమా రెన్యువల్ చేయించడంతో సదరు రోడ్డు ప్రమాదానికి గురైన కారుకు బీమా వర్తింపు వచ్చే విధంగా ఎస్సై జరిగిన వాస్తవాలను దాస్తూ కారును ద్విచక్రవాహనం ఢీకొట్టిన సంఘటన ఫిబ్రవరి 6వ తేదీన జరిగినట్లుగా ఫిబ్రవరి 13వ తేదీన కారు యజమానికి లబ్ధి చేకూర్చే విధంగా వివిధ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం సస్పెండ్ అయిన ఎస్సై గతంలో సారంగాపూర్ పోలీసుస్టేషన్ ఎస్సైగా పని చేసే సమయంలో జూదగృహాలను ప్రోత్సహించినట్లుగా ఆరోపణలు రావడంతో ఉన్నత పోలీస్ అధికారులు ఎస్సైని మందలించిన ఎస్సైలో ఎలాంటి మార్పు రాకపోగా పోలీసుశాఖ కీర్తిప్రతిష్ఠలకు భంగం కలిగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నిర్మల్ రూరల్ ఎస్సై కె.చంద్రమోహన్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ ఐజీపీ 1 ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జూన్ 13 : జిల్లాలో పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణా చట్ట విరుద్ధమని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా నిర్వహించాలని సూచించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... అనుమతి లేకుండా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 27 చెక్‌పోస్టులు జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువులు అక్రమ రవాణా చేసే అవకాశాలున్నాయని, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు అరికట్టడం, యువత దానికి బానిసలు కాకుండా చూసే బాధ్యత మనపై ఉందని కలెక్టర్ అన్నారు. జిల్లా ఏరియా ఆసుపత్రిలో డ్రగ్స్ డి అడిక్షన్ కేంద్రం నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీసు, ఆబ్కారీ శాఖాధికారులు నిఘా పెంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎస్పీ గంగారెడ్డి, వైద్యాధికారి ధనరాజ్, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, తదితర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నులి పురుగుల నివారణ పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

జిల్లాలో నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నియంత్రణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. 1 నుంచి 19 వయసు గల పిల్లలు జిల్లాలో 1,92,000ల మంది ఉన్నారని తెలిపారు. అందరికి నులి పురుగుల నివారణ మాత్రలు అందజేయాలన్నారు. నులి పురుగుల వల్ల కలిగే నష్టాలు పిల్లలకు తెలియజేయాలన్నారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారి ధనరాజ్, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, సంక్షేమ శాఖాధికారి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు అప్పచెప్పక పోవడాన్ని నిరసిస్తూ

డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారుల ఆందోళన

● భైంసా- మహాగామ్ రోడ్డుపై రాస్తారోకో ● అధికారులతో వాగ్వాదం


ఆందోళనకు దిగిన లబ్ధిదారులు


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సీహెచ్ కోమల్‌రెడ్డి

భైంసా, జూన్ 13 : కాలయాపనకు తావులేకుండా అన్ని రకాల వసతులు కల్పించి తమకు ఇళ్లు అప్పచెప్పాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కేంద్రమైన భైంసాలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు ఆందోళనలు చేపట్టారు. రెండు రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్న లబ్ధిదారులు గురువారం భైంసా- మహాగామ్ రోడ్డు మార్గంలోని డబుల్ బెడ్ రూమ్ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఏడాది క్రితం తాము లబ్ధిదారులుగా ఎంపికైన ఇళ్లు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ వారందరూ ధర్నాకు దిగారు. ప్రభుత్వం, అధికారులు అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ప్రదర్శనలు చేపట్టారు. పూర్తిస్థాయిలో వసతులు, సౌకర్యాలు కల్పించి అధికారికంగా ఇళ్లు అప్పచెప్పేంత వరకు తాము ఇక్కడి నుంచి కదలబోమని వెల్లడించారు. సంబంధిత సమాచారం అందుకున్న భైంసా ఆర్డీవో, తహసీల్దార్ ప్రవీణ్‌కు ఘటనస్థలికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. విద్యుత్, నీటి వసతి, సానిటేషన్ వ్యవస్థలను పూర్తి చేసి ఇళ్లు అప్పచెప్పేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు వివరించారు. గత సంవత్సర కాలంగా ఇదే తరహారీతిలో వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్నారంటూ లబ్ధిదారులు అధికారులను నిలదీసి వాగ్వాదానికి దిగారు. దీంతో ఆర్డీవో సీహెచ్ కోమల్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు సంబంధిత సమస్యలన్నింటినీ వివరించి త్వరితగతిన ఇళ్లు కేటాయించేందుకు బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతామంటూ సముదాయించి శాంతపరిచారు. దీంతో లబ్ధిదారులు తమ ఆందోళనలను విరమించారు. కాగా కొంత మంది లబ్ధిదారులు బుధవారం డబుల్ బెడ్ రూమ్ కాంప్లెక్స్‌లోకి వెళ్లి ఇళ్లను ఆక్రమించుకొని నివాసము ఉండే విధంగా చర్యలు చేపట్టారు. 100కు పైగా మంది లబ్ధిదారులు ఇళ్లను ఆక్రమించుకున్న వారిలో ఉన్నారు.

బాధితుడిని పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ కల్చరల్, జూన్ 13 : హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మంజులాపూర్ కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి కుమారుడిని గురువారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు పడాల శ్రీనివాస్, రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్ తదితరులున్నారు.

రేపు పెన్షనర్లకు ఉచిత కంటి పరీక్షలు

నిర్మల్ కల్చరల్, జూన్ 13 : జిల్లాలోని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులకు శనివారం సంఘ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుండి ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎంపీ ఓవైసీని కలిసిన ఎంఐఎం నేతలు


అసదుద్దీన్ ఓవైసీని సన్మానిస్తున్న నేతలు

నిర్మల్ కల్చరల్, జూన్ 13 : నిర్మల్ ఎంఐఎం నాయకులు గురువారం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 5వసారి ఎంపీగా గెలుపొందిన సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందించారు. జిల్లా అధ్యక్షుడు అజీమ్ బీన్ యాహియా, మాజీ కౌన్సిలర్ రఫీ అహ్మద్ ఖురేషి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ మజహర్, కౌన్సిలర్ ముజాహిద్ అలీ, తయ్యాబ్ బీన్ సలహా, అన్సారీ, అతీక్, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

ఉర్సే ఏ షరీఫ్ ఉత్సవాలకు ఏర్పాట్లు


ఏర్పాట్లపై సూచనలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జూన్ 13 : సోఫీనగర్ ప్రాంతంలో ఈ నెల 22 నుండి మూడు రోజులపాటు నిర్వహించే ప్రసిద్ధ హజరత్ సోఫీ హుస్సేన్ అలీషా ఖాద్రి సత్తారి రహమతుల్ అలీ ఉర్సే ఏ షరీఫ్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. గురువారం ఆ ప్రాంతాన్ని కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. అక్కడికి వచ్చే భక్తులకు తాగునీరు. వీధి దీపాలు, పరిశుభ్రత తదితర సౌకర్యాలు మున్సిపల్ పరంగా కల్పించనున్నట్లు చెప్పారు. నిర్వాహకులు సోఫీ సమద్ పాషా ఖాద్రి, కౌన్సిలర్లు మహమ్మద్ అబ్దుల్ మతీన్, ముజాహిద్ చావుస్, మొహమ్మద్ అన్వర్, సయ్యద్ జలీల్ అజహర్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం నాయకులతో ఎస్సై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

సారంగాపూర్, జూన్ 13 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం కమ్యూనిటీ నాయకులతో గురువారం ఎస్సై శ్రీకాంత్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ నెల 17న నిర్వహించే బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించాలని ముస్లిం కమ్యూనిటీ నాయకులకు సూచించారు.